క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బుధవారం కంటి వైద్య శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి నిర్వహించారు. డాక్టర్ గ్రీష్మ కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. అవసరమైన వారికి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామని చెప్పారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వి.కోట: పట్టణంలో భారత్‌నగర్‌లోని వృద్ధాశ్రమానికి ఏ–వన్ ఫౌండేషన్ నిత్యావసర సరుకులు, కూరగాయలు వితరణ చేసింది. సభ్యులు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర సెక్రటరీ జిక్రియ, జిల్లా జాయింట్ సెక్రటరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



బైరెడ్డిపల్లె వద్ద దుకాణాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

బైరెడ్డిపల్లి: బెంగుళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా బైరెడ్డిపల్లె సమీపంలోని దుకాణాల తొలగింపు పనులకు బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి చర్యలు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా దుకాణాలకు పరిహారం చెల్లించినా ఖాళీ చేయకపోవడంతో పోలీస్ సిబ్బందితో చేరుకుని యంత్రాలతో వాటిని తొలగించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా దుకాణాలు ధ్వంసం చేయడంతో బాధితులు లబోదిబోమన్నారు. నష్టపరిహారం విషయంలో కొంత మంది బాధితులు పరిహారం తీసుకోకుండా కోర్టును ఆశ్రయించారు. వారం రోజుల్లో పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని, రోడ్డు పనులకు సహకరించాలని జేసీ కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ భవాని, సీఐ మురళీమోహన్, తహసీల్దార్ మాధవరాజు, ఎస్ఐ పరుశురాముడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బధిరులకు ప్రత్యేక ఉద్యోగావకాశాలు

వి.కోట: ప్రఖ్యాత మల్టీ నేషనల్ కంపెనీ అమెజాన్ పలమనేరు నియోజకవర్గంలోని బధిరుల కోసం ఉద్యోగావకాశాలు కల్పించింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని అమెజాన్ కార్యాలయం ప్రతినిధులు ఈ నెల 13న గంగవరంలోని ఆర్ఐఎమ్ఆర్ఎస్ శిక్షణ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని, అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్లలోపు వారై ఉండాలని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 3 నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 9652453964, 9573779527 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పూర్వపు కమిషనర్ అరుణపై విచారణకు ఆదేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో కమిషనర్ గా పనిచేసిన అరుణపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇక్కడ పనిచేసిన కాలంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీటిపై విచారణకు ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏపీయూఎస్ఐడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్ర బియానీని విచారణ అధికారిగా నియమించారు. త్వరలో ఆయన చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డీఈలు ప్రసాద్, ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈలు ప్రసాద్, ఆనంద్ తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సంతపేటలో చెట్లకు తీగలు తగలకుండా సైడ్‌హారం ఏర్పాటు చేయాలని, రెడ్డిగుంట సెక్షన్ పరిధిలో వ్యవసాయ సర్వీసులకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విన్నవించారు. కొంగారెడ్డిపల్లె పరిధిలో మీటర్ పేరు మార్పు, గుడిపాల పరిధిలో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయాలని మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయని, సంబంధిత సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది డీఈలు ఆదేశించారు.

నల్లమందు ఉండకు శునకం బలి

వన్యప్రాణులకు వేటకు వేటగాళ్లు వినియోగించే నల్లమందు ఉండలకు అడవిలో మేతకెళ్లే పశువులు, మేకలు కూడా బలైపోతున్నాయి. ఎక్కడ ఏ ఉచ్చు ఉందో..ఎక్కడ ఏ నల్లమందు ఉండలున్నాయోనని పశువులు, మేకల కాపర్లు, ఎలిఫెంట్ ట్రాకర్లు హడలిపోతున్నారు. తాజాగా గంగవరం మండలంలోని గంగ్రాజుపల్లె ఓ వీధికుక్క గ్రామ సమీపంలోని అడవిలో మాంసం వాసనున్న ఓ నల్లమందు ఉండను తీసుకొచ్చింది. గ్రామంలోని శంకరప్ప ఇంటివద్ద దాన్ని కొరగ్గా అది భారీ శబ్దంతో పేలడంతో కుక్క తల ఛిద్రమై 20 అడుగులు పైకి లేచి ఆ ఇంటిపై పడింది. దీంతో ఆ గ్రామస్తులు భీతావహులయ్యారు.



నల్లమందు ఉండ కొరికి తల ఛిద్రమై చనిపోయిన శునకం (ఫైల్)

మరెన్నో వన్యప్రాణులు

ఇప్పటికే వేటగాళ్ల కారణంగా కౌండిన్యలో లెక్కలేనని దుప్పులు, అడవిపందులు వేటగాళ్లకు దెబ్బకు బలయ్యాయి. గతంలో పలమనేరు సమీపంలోని మన్నారునాయనిపల్లెలో ఓ వ్యక్తి దుప్పుల కోసం అమర్చిన కరెంటు తీగలకు ఓ మదపుటేనుగు మృతి చెందడం విదితమే. అలాగే, మండలంలోని ముసలిమొడుగు వద్ద వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి ఎలుగుబంటి మృతి చెందింది. ఇక నల్లమందు ఉంటలకు ధాటికి ఎన్నో పశువుల దవడలు పేలిపోయి మృతి చెందిన సంఘటనలు ఇక్కడ షరా మామూలైంది. మారాయి.





వేటగాళ్ల ఉచ్చుకు బలైన ఎలుగుబంటి, దుప్పి (ఫైల్)


నల్లమందు ఉండల మోత!

కౌండిన్య అభయారణ్యంలో వన్యప్రాణుల వేట ఆగడం లేదు. వేటగాళ్ల ఆగడాలు అడపాదడపా వెలుగులోకి వస్తున్నా గుట్టుచప్పుడు కాకుండా వేటగాళ్ళు తమపని కానిచ్చేస్తున్నారు. కౌండిన్య అడవికి ఆనుకుని ఉన్న కొందరు వేటగాళ్లు వన్యప్రాణుల వేటే వృత్తిగా చేసుకున్నారు. చికెన్, మటన్ దొరికినంత సులువుగా ఈ ప్రాంతంలో వన్యప్రాణుల మాంసం దొరుకుతోందంటే ఇక్కడ వేట ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. వన్యప్రాణులే కాకుండా పశువులు, శునకాలు సైతం వేటగాళ్ల నల్లమందు ఉండల దెబ్బకు బలైపోతున్నాయి.

- వేటగాళ్ల దెబ్బకు పెంపుడు కుక్కలు, పశువులు సైతం మృత్యువాత
- ఆరునెలలుగా కౌండిన్య అడవిలో పేట్రేగుతున్న వేటగాళ్లు
- నాటు తుపాకులు, ఉచ్చులు, నల్లమందు ఉంటలతో వేట
- తాజాగా నాటుబాంబు కొరికి శునకం తల ఛిద్రం
- అడవుల్లోకి వెళ్లాలంటే పశువులు, మేకల కాపర్లకు భయం
- వేటగాళ్లపై అటవీశాఖ చర్యలు శూన్యం



అడవిలో వేటగాళ్ల నల్లమందుకు ఉండ ధాటికి దవడ పేలి గాయపడిన ఆవు (ఫైల్)





కౌండిన్య అభయారణ్యం, (ఇన్‌సెట్) అడవిలో వన్యప్రాణుల కోసం పెట్టిన నల్లమందు ఉండ

పలమనేరు: జిల్లాలోని పశ్చిమ భాగంలో కౌండిన్య అభయారణ్యం పలు వన్యప్రాణులకు నిలయంగా ఉంది. జిల్లాలోని బంగారుపాళ్యం నుంచి పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల వరకు సుమారు 350 చదరపు కిమీ మేర ఇది వ్యాపించి ఉంది. ఈ అడవిలో 80దాకా ఏనుగులు, పెద్ద సంఖ్యలో జింకలు, దుప్పులు, కణితులు, ఎలుగుబంట్లు, నెమళ్లు ఉన్నాయి. వీటితో పాటు అడవి గొర్రెలు, కుందేళ్లు, బావురు పిల్లులు, ఉడుములు, నక్కలు, ఇవిగాక 40 రకాల క్షీరదాలు,160కి పైగా పలురకాల పక్షులు, అరుదైన కొంగలు, వంద రకాల సీతాకోక చిలుకలు, నక్షత్ర తాబేళ్లు, ఇతర కీటకాలతో పాటు మరికొన్ని జంతువులు ఉన్నాయి.

వన్యప్రాణులకు తప్పని ముప్పు

అటవీశాఖ ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వన్యప్రాణులకు మాత్రం రక్షణ కరువవుతోంది. ముఖ్యంగా పలమనేరు, బంగారుపాళ్యం, సోమల, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, రామసముద్రం, వి.కోట, కుప్పం నియోజవర్గాల్లోని అటవీప్రాంత గ్రామాల్లో వేట నిత్యకృత్యమైంది. వేటగాళ్లు నాటు తుపాకులు, నల్లమందు ఉంటలు, ఉచ్చులతో నిరాటంకంగా వన్యప్రాణులను వేటాడుతున్నారు.

పెరిగిపోతున్న వేటగాళ్లు

పలమనేరు, కుప్పం ఫారెస్ట్ రేంజి పరిధిలో అడవులకు ఆనుకుని దాదాపు 160 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని కొందరు వన్యప్రాణుల వేటే జీవనోపాధిగా మార్చుకున్నారు. నాటు బాంబులను తయారు చేసుకుని వాటిపై వన్యప్రాణులకు ఇష్టమైన పదార్థాలను ఉంచి ఎరగా అడవిలో పెట్టి వస్తుంటారు. వీటిని కొరడం ఆలస్యం అవి పేలి వన్యప్రాణులు అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ఇలా చనిపోయిన వాటిని మరుసటి రోజు వెళ్లి ఈ వేటగాళ్లు తీసుకొస్తుంటారు. ఇక కమ్మీలు, వైర్లతో తయారు చేసిన ఉచ్చులను పగటి పూట అడవిలో చెట్ల మధ్య అమర్చడం..వాటిల్లో ఏవేనీ తగులుకుంటే వాటిని అక్కడే చంపి, మాంసాన్ని తీసుకువస్తున్నట్టు తెలిసింది. ఈ వేటగాళ్ల మూలాన ఊరకుక్కలు, అడవిలో మేతకెళ్లే పశువులు, మేకలు తరచూ బలవుతూనే ఉన్నాయి. పశువుల కాపరులు ఏమాత్రం ఆదమరిచి నల్లమందు ఉండలపై అడుగుపెడితే ఇక అంతే సంగతులు!

కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేక...

ఇలా ఉండగా జిల్లా ఫారెస్ట్ అధికారిణి భరణి, ఎఫ్ఆర్వోలుగా కొత్త అధికారులు బదిలీలపై వచ్చారు. వీరికి ఇక్కడ వన్యప్రాణులు వేట, వాటి మాంసం విక్రయాలపై పెద్దగా అవగాహన లేకపోవడం వేటగాళ్లకు కలిసొచ్చింది. ఇప్పటికైనా దీనిపై ఫారెస్ట్ సిబ్బంది దృష్టి సారించి వేటగాళ్ల భరతం పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెరువులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

రొంపిచెర్ల: మండలంలో మూడు చెరువులకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీలోని గొని చెరువు, వెంకటనాయుని చెరువు, పెద్దమల్లెల గ్రామ పంచాయతీలోని నాయుని చెరువులకు ఆయకట్టు కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. చిచ్చిలివారిపల్లె, గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాల, పెద్దమల్లెల గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, ఈ నెల 14న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. చెరువు ఆయకట్టు రైతులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికే సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారాం

గుడుపల్లె: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీతారాం అన్నారు. బుధవారం మండలంలోని పొగురుపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 70 మంది రైతులు వినతి పత్రాలు ఇచ్చారు. వీటిలో 8 సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించామని, మిగిలినవి త్వరలోనే ఆయా వీఆర్‌ఓలు భూములను పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు టీఎం బాబునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏసీ ఎంఈఓగా సిద్ధరామయ్య

సదుం: మండల ఫుల్ అడిషనల్ చార్జ్ ఎంఈఓగా సిద్ధరామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పులిచెర్ల ఎంఈఓగా పని చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎంఈఓ–2 దామోదర, ఉపాధ్యాయ సంఘం నాయకులు మోహన్ రెడ్డి, ప్రసాద్, నరేష్, సుబ్రహ్మణ్యం, నరసింహులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలో ఎంఈఓగా పని చేసిన శ్రీరాములు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు.

పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు!

- కుంటుపడుతున్న మున్సిపాలిటీ అభివృద్ధి

పుంగనూరు: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, నీటి పన్ను కూడా ప్రభుత్వ శాఖలు చెల్లించకపోవడంతో మున్సిపల్ అభివృద్ధి కుంటుపడుతోంది. మున్సిపాలిటీలోని 31 ప్రభుత్వ కార్యాలయాలకు రూ.1.23 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకుండా ఆదాయాన్నిచ్చే శాఖలు సైతం మున్సిపాలిటీ పన్నుపై నిర్లక్ష్యం వహిస్తున్నాయనే విమర్శలొస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయం రూ.15.47 లక్షలు, కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు రూ.11.64 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.5.44 లక్షలు, తహసీల్దార్ గ్రామ చావడి రూ.1.79 లక్షలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.1.40 లక్షలు, సబ్‌ట్రెజరీ కార్యాలయం రూ.8.51 లక్షలు, ఎక్సైజ్ కార్యాలయం రూ.4.77 లక్షలు, పోలీస్ శాఖ రూ.6.80 లక్షలు, అలాగే పంచాయతీరాజ్‌శాఖ రూ.11.30 లక్షల చొప్పున బకాయిలు ఉన్నాయి. కేవలం ట్రాన్స్‌కో, మార్కెట్ కమిటీ, వ్యవసాయశాఖ, అటవీ శాఖ, ఏపీఎస్ ఆర్టీసీ మాత్రమే ఎప్పటికప్పుడు పన్నులు చెల్లిస్తున్నాయి. మిగిలిన శాఖలు ఏళ్ల కాలంగా చెల్లించకపోవడం వలన మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

– ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్



ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్

పుంగనూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీలు శ్రీనివాసులు, నరేంద్ర, చిన్నబ్బ తో కలసి విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే ఎలాంటి విద్యుత్ సమస్యలు ఎదురైనా తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. తీవ్రమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే వర్షాకాలం కావడంతో విద్యుత్ అంతరాయంతో పాటు లైన్లు పడిపోవడం, షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉందన్నారు. వీటిని నియంత్రించేందుకు ప్రతి ప్రాంతంలోను ఏఈలు, లైన్‌మెన్లు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.. అలాగే సబ్‌స్టేషన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

శ్రీకృష్ణ ఆలయంలో గీతా పారాయణం



శ్రీకృష్ణాలయంలో భగవద్గీతా పారాయణం చేస్తున్న భక్తులు

పుంగనూరు: పట్టణ సమీపంలో కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో బుధవారం స్వామి వారికి ఏకాదశి పూజలు నిర్వహించారు. అలాగే రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో భగవద్గీతా పారాయణం చేశారు. తిరుపతి ఇస్కాన్ ఆలయానికి చెందిన కదంబర కృష్ణదాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను భక్తులు విరామం లేకుండా పారాయణం చేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాన్ని గ్రహించి జీవితానికి అన్వయించుకుని నడచుకోవాలని కృష్ణదాస్ పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉత్తీర్ణత శాతం పెంపే లక్ష్యం



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి

వి.కోట: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడమే లక్ష్యంగా సంకల్ప–2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి సయ్యద్ మౌలా అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అభ్యాసన సామర్థ్యానికి అనుగుణంగా మెటీరియల్‌ను చదివి, అర్థం చేసుకుని రాయడం ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో నిర్వహించే స్టడీ అవర్స్‌కు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి విద్యాశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడారు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాశక్తి పేద విద్యార్థులకు వరం

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన సంకల్పం–2025 విద్యాశక్తి పేద విద్యార్థులకు వరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సయ్యాద్ మౌలా పేర్కొన్నారు. బుధవారం కుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సంకల్పం మెటీరియల్‌ను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత, విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. అలాగే ఐఐటీ చెన్నై ఇస్తున్న శిక్షణను ఎంపీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎంఓ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ వాసుదేవ రెడ్డి, అధ్యాపకులు సరిత, ధరణి, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కుప్పం: సంకల్పం మెటీరియల్ పంపిణీ చేస్తున్న మౌలా

దివ్యాంగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



ఇర్షాద్



మహ్మదాలీ

రొంపిచెర్ల: మండల దివ్యాంగుల అసోసియేషన అధ్యక్షుడిగా షేక్ ఇర్షాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రొంపిచెర్లలో దివ్యాంగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ మహ్మదాలీ, కార్యవర్గ సభ్యులుగా బాషా, రెహ్మాన్, దిలీప్, ఆనంద, వాసు, ఎస్.బావాజాన్ ఎన్నికయ్యారు. ఇర్షాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో ప్రభుత్వ పథకాలు ఉన్నా వాటి గురించి తెలియకపోవడం వలన అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలసికట్టుగా పోరాటం చేయాలన్నారు. తన వంతు దివ్యాంగుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.



కార్తీక్ యాదవ్, భవాని పెళ్లి వేడుకల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆశీస్సులు

పుంగనూరు: స్థానిక ఎన్ఎస్.పేటకు చెందిన గౌరమ్మ కుమారుడు కార్తీక్‌యాదవ్, భవాని వివాహ వేడుకలకు, అలాగే మండలంలోని ఆరడిగుంటకు చెందిన రెడ్డెప్ప కుమార్తె హారతి, రవితేజ వివాహ వేడుకలకు బుధవారం పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్లు అమ్ము, కిజర్‌ఖాన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



హారతి, రవితేజ వివాహ వేడుకల్లో..

13న కలెక్టరేట్ ముట్టడికి తరలిరండి



అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



వి.కోట: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ పార్టీ అధిష్టానం మేరకు శుక్రవారం చిత్తూరులో వైఎస్సార్ సీపీ నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కుప్పం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేసి, రైతు భరోసానిస్తే అధికార కూటమి ప్రభుత్వం దీని ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. పెట్టుబడి సాయం చేస్తామని హామీ ఇచ్చి చివరకు రైతులను నిలువుగా దగా చేసిందని విమర్శించారు. అంతేకాకుండా విద్యుత్ చార్జీలతో బాదుడు మొదలెట్టిందని, అలాగే వ్యవసాయ బోర్లకు మీటర్లు ఏర్పాటు చేసి రైతు వ్యతిరేకి ప్రభుత్వంగా ముద్ర వేసుకుంటోందన్నారు. కలెక్టరేట్ ముట్టడికి కుప్పం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కరపత్రాలకు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుడుపల్లె జెడ్పీటీసీ కృష్ణమూర్తి, ఎంపీపీ కోదండరెడ్డి, రామకుప్పం, శాంతిపురం మండలాల కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి, నాయనపల్లి కృష్ణమూర్తి, కౌన్సిలర్ మోహన్ రాం, చంద్రారెడ్డి, సంపంగి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వీ.కోటలో..

వి.కోట: అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ పార్టీ నిర్వహించనున్న ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను బుధవారం పలమనేరు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ అధిష్టానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన ఆందోళనకు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగాన్ని అధికార కూటమి ప్రభుత్వం దగా చేసిందని, వారి సంక్షేమానికి ఏమాత్రమూ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నా ఆదుకోవడం లేదని దుయ్యబట్టారు. రైతులు తమ వ్యవసాయోత్పత్తులను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నా ప్రభుత్వంలో కదలిక లేదని, కలెక్టరేట్ ముట్టడికి పార్టీ శ్రేణులన్నీ హాజరు కావాలని కోరారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పని అగచాట్లు



బండకిందపల్లె సమీపంలో నిలిచి పోయినబస్సు

రొంపిచెర్ల: ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడిన సంఘటన బుధవారం మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల మండలం బండకిందపల్లె సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతి నుంచి అన్నమ్మయ్య జిల్లా రాయచోటి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు రాయచోటికి వెళుతూ బండకిందపల్లె సమీపంలో మరమ్మతులకు గురై మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు పడిగాపులు కాసి మరో బస్సులో ఎక్కి వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల కాలంలో తరచూ జాతీయ రహదారిలో వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. ఈ కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నారు. కాలం చెల్లిన బస్సులను తిప్పడం వలనే ఇలా జరుగుతోందని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి కొత్త సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జర్నలిస్టుల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కుప్పం: సినీనటుడు మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడాన్ని నిరసిస్తూ కుప్పం జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బస్టాండు నుంచి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. మీడియా కవరేజ్‌కు వెళ్లిన విలేకర్ల పట్ల దురుసుగా ప్రవరించి మోహన్ బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కుప్పం పోలీసు స్టేషన్ రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి వెంకటాచలం, జర్నలిస్టులు రోహిత్, మణి, శివ, శ్రీనాథ్, సోము, కణ్ణన్, ఆనంద్, గణేష్, హరి పాల్గొన్నారు.